క్లుప్తంగా

నేడు గూడూరు మండల మీట్

కోడుమూరు రూరల్ : గూడూరు మండల సర్వ సభ్య సమావేశాన్ని శనివారం స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ భవనంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఎంపీపీ సునీత అధ్యక్షతన జరిగే మండల మీట్‌కు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరవుతారని, అన్ని శాఖల అధికారులు తమతమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో పాల్గొనాలని సూచించారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సి.బెళగల్: మండలంలోని తుంగభద్ర నది నుంచి అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం గస్తీ నిర్వహించామన్నారు. తుంగభద్ర నదీతీర గ్రామమైన తిమ్మందొడ్డి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఎమ్మిగనూరు పట్టణాలకు చెందిన మూడు టాక్టర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులకు అప్పగించామని చెప్పారు.

వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం చంద్రశేఖర్

ఓర్వకల్లు: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఉత్పత్తులను గ్రామాలలో అమ్మేందుకు పొదుపు మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం స్థానిక పొదుపు భవనంలో నిర్వహించిన కార్యక్రమానికి డీపీఎం చంద్రశేఖర్, డీఎల్ఎంపీ లక్ష్మయ్య, వెలుగు ఏపీఎం వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహార ఉత్పత్తులతో ఏవిధమైన ఆరోగ్య సమస్యలు తలెత్తవని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు, వీఓఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీలేఖ, వంశీకృష్ణ, ఎన్ఎఫ్ఏలు మల్లికార్జున, జగదీష్, అరుణ, యశస్విని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తక పఠనం అలవర్చుకోవాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ ఆదామ్‌బాషా

సి.బెళగల్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఎంఈఓ – 2 ఆదామ్ బాషా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ బలరాముడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ విద్యార్థులకు బహుమతులు అందజేసి మాట్లాడారు. పుస్తక పఠనం మానసిక, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందన్నారు. గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ విజేయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు పరిశీలన


రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏఈ ముక్తార్ బాషా

కర్నూల్(రూరల్): మండల పరిధిలోని బి.తాండ్రపాడు గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను శుక్రవారం మండల అసిస్టెంట్ ఇంజినీర్ ముక్తార్ బాషా పరిశీలించారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణలు పాటించాలని ఆయన కాంట్రాక్టర్‌కు సూచించారు. గడువులోపు పనులు పూర్తి చేయలన్నారు.

మద్దూరు పీహెచ్‌సీ వర్కర్ల సస్పెన్షన్

పాణ్యం: మండల పరిధిలోని మద్దూరు పీహెచ్‌సీలో కంటినెంట్ వర్కర్లుగా పని చేస్తున్న ఇద్దరిని సస్పెండ్ చేసినట్లు డాక్టర్ సునీతా శుక్రవారం తెలిపారు. పీహెచ్‌సీలో నైట్ వాచ్‌మెన్‌గా పని చేస్తున్న నథానియేలు, స్వీపర్‌గా పని చేస్తున్న సుబ్బమ్మను సస్పెండ్ చేశామన్నారు. ప్రజల ఫిర్యాదుల నేపథ్యంలో డీఎం అండ్‌హెచ్‌ఓ ఆదేశాల మేరకు వారిని సస్పెండ్ చేసినట్లు డాక్టర్ చెప్పారు.

ఐటీ విద్యపై అవగాహన

సి.బెళగల్: సి.బెళగల్ మోడల్ స్కూల్ పది, ఇంటర్ విద్యార్థులకు సమాచార విద్య (ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ – ఐటీ విద్యా)పై అవగాహన కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు హరిశంకర్, శివకృష్ణ నిర్వహించారు. స్థానిక ఆర్‌కే నెట్ సెంటర్‌ను సందర్శించి అవగాహన కల్పించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. అదేవిధంగా పారిశ్రామిక సందర్శణలో భాగంగా సి.బెళగల్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. విద్యుత్ సరఫరా, నియంత్ర పనితీరు విధానాలను విద్యుత్ అధికారులు విద్యార్థులకు వివరించారు.

తీరని ‘కుంట’ సమస్య!

- ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న కందికాయపల్లె గ్రామస్తులు
- మూగజీవాలకు నీటి వసతిలేక ఇబ్బందులు పడుతున్న పశుపోషకులు
- గత ప్రభుత్వంలో రూ. 1.80కోట్లకు ప్రతిపాదనలు


కందికాయపల్లె సమీపానున్న కుంట


లీకేజీలను పరిశీలిస్తున్న మైనర్ ఇరిగేషన్ అధికారులు (ఫైల్)

పాణ్యం: మండల పరిధిలోని కందికాయపల్లె కొండ మీద ఉన్న ఓ కుగ్రామం. ఈ గ్రామానికి చేరుకోవాంటే చుట్టు 20కిలోమీటర్లు వెళ్లాలి. చుట్టూ కొండ ప్రాంతమే. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దాదాపు రూ. 4,500కోట్లతో సోలార్, విండ్ పరిశ్రమలను ఏర్పాటు అయ్యాయి. అభివృద్ధి బాటలో పయణిస్తున్న గ్రామంగా కందికాయ పల్లె నిలుస్తుంది. అయితే గ్రామ ప్రజలు ఆకాంక్ష కుంట నిర్మాణ ం. కుంట సరిగ్గాలేకపోడంతో నీటి వసతి కరువైంది. చూడ్డానికి కుంటలా ఉన్నా చెరువుకు ఏ మాత్రం తగ్గదు. కట్టలు సరిగ్గా లేకపోవడంతో నీటి నిల్వ సరిగ్గా కావడం లేదు. దీంతో మూగజీవాలకు తాగునీరు లభించడం లేదు. పశుపోషణ కష్టంగా మారింది. ఈ గ్రామంలో మొత్తం 450 గృహాలు, 1,931మంది జనాభా, 1,100మంది ఓటర్లు ఉన్నారు. గత ప్రభుత్వంలో చాలా వరకు మౌలిక వసతుల సమకూరినప్పటికీ కుంట సమస్య కలగానే మిగిలిపోయింది. అప్పటి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఆ గ్రామంలో మౌలిక వసతులు సమకూర్చారు. అదేవిధంగా ప్రజల విన్నపం మేరకు కాటసాని ఆదేశాలతో మైనర్ ఇరిగేషన్ అధికారులకు గ్రామాన్ని సందర్శించి కుంటు నిర్మాణం అవసరాన్ని గుర్తించారు. ఈ మేరకు రూ. 1.80కోట్లకు ప్రతిపాదనలు తయారు చేశారు అధికారులు. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల ఎన్నిక ప్రక్రియ ప్రారంభమైంది. దీంతో కుంటు నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియ నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో ఆ సమస్యను పట్టించుకునే నాథుడు కరువయ్యారు. అధికారులు స్పందించి కుంట నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే కాటసాని చొరవతో తీరిన తాగునీటి కష్టాలు ....

పాణ్యం మాజీ ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవతో కొండల్లో ఉన్న కందికాయపల్లె అభివృద్ధి బాట పట్టింది. ప్రత్యేకించి తాగునీటి కష్టాలు తీర్చారు. గ్రామం అంతా కొండ అయినందున గతంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేది. అయితే 2012సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తాగునీటి సమస్యకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఏకంగా బనగానపల్లె మండలం రామతీర్థం గ్రామం నుంచి సుమారు 6కిలో మీటర్ల మేర పైపులైన్ ఏర్పాటు చేయించి ఆ గ్రామ ప్రజలు దాహార్తి తీర్చారు. నేటికి ఈ పైపులైన్ ద్వారానే ప్రజలకు నీరు సరఫరా అవుతుంది. అదేవిధంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనూ గోరుకల్లు–జోన్ వాటర్‌గ్రిడ్ కింద సిమెంట్ నగర్ నుంచి పైపులైన్ వేయించి శాశ్వత పరిష్కారం చూపారు మాజీ ఎమ్మెల్యే కాటసాని.

పశుపోషణ ఎక్కువే..

గ్రామంలో పశుపోషణ చాలా ఎక్కువ. బర్రెలు, ఆవులు, జీవాల పెంపకం ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం సోలార్ వచ్చిన కారణంగా బర్రెలు, ఆవుల సంఖ్య తగ్గాయి. గొర్రెలు, మేకలు అధికంగా ఉన్నాయి. గ్రామం చుట్టు భారీ కొండలు ఉండడం వలన పశువులకు వేసవికాలం తప్పా అన్ని కాలల్లో పశుగ్రాసం దొరికేది. అయితే తాగేందుకు నీరు లేని కారణంగా చాలా మంది తమ జీవనాధారమైన పశువులను విక్రయించుకుంటున్నారు. కేవలం నీటి సమస్యలతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. కుంట నిర్మాణం జరిగితే మూగజీవాలకు నీటితోపాటు సాగుకు కొంతమేర వెసులుబాటు ఉంటుందని గ్రామస్తులు ఆశిస్తున్నారు. అధికారులు స్పందించి కుంటు నిర్మాణం చేపట్టాలని కందికాయపల్లె గ్రామస్తులు కోరుతున్నారు.

కుంట నిర్మాణం చేపట్టాలి



మా గ్రామానికి చిరకాల వాంఛ ఈ కుటం నిర్మాణం. ఈ కుంటను అధికారులు నిర్మించి లాకులు ఏర్పాటు చేస్తే సమస్య తీరుతుంది. మూగజీవాల నీటి సమస్యతోపాటు దిగువ పొలాలకు సాగునీరు అందుతుంది. అంతేకాక గ్రామంలోని పశువులకు నీటి సమస్య తీరుతుంది. ఇప్పటికే సోలార్ విస్తరించడంతో పశుగ్రాసానికి ఇబ్బంది పడుతున్నారు. వేసవి కాలంలో పశువులకు నీరు లేక ఇతర గ్రామాలకు పంపుతున్నాం. మా గ్రామానికి ఈ కుంట నిర్మిస్తే బాగుటుంది. ఇప్పటికే సమస్యను పలుమార్లు అధికారులకు దృష్టికి తీసుకెళ్లాం.

– రామచంద్రుడు, సర్పంచ్, కందికాయపల్లె

న్యాయశాఖ కార్యదర్శిగా జడ్జి ప్రతిభాదేవి

కర్నూలు (లీగల్): కర్నూలు నాల్గవ అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న జి.ప్రతిభా దేవిని న్యాయశాఖ కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె రెండు సంవత్సరాల పాటు ఈ బాధ్యతల్లో కొనసాగుతారు. ఇప్పటివరకు న్యాయశాఖ కార్యదర్శిగా పనిచేస్తున్న వి.సునీతను రిలీవ్ కావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు జీఓ జారీ చేసినట్లు తెలిసింది.

హంద్రీనీవా ఎస్ఈగా ఏవీ సురేష్‌బాబు

కర్నూలు (సిటీ): హంద్రీనీవా సుజల స్రవంతి పథకం సర్కిల్–1 పర్యవేక్షక ఇంజినీర్‌గా ఎ.వెంకట సురేష్ బాబును నియమించారు. ప్రస్తుతం ఈయన ఎస్ఆర్‌బీసీ సర్కిల్–2 డివిజన్–3 ఈఈగా పనిచేస్తున్నారు. హంద్రీనీవా పర్యవేక్షక ఇంజినీర్‌గా ప్రస్తుతం డి.రాంగోపాల్ పనిచేస్తున్నారు. ఆయనను ఎక్కడికి బదిలీ చేస్తున్నారో స్పష్టత ఇవ్వలేదు. ఆయన రిలీవ్ అయిన తర్వాత సురేష్ బాబు ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించనున్నారు. అదే విధంగా హంద్రీనీవా డిప్యూటీ ఎస్ఈగా అనంతపురం సర్కిల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉషారాణిని నియమించారు.

లోక్ అదాలత్‌పై సమావేశం

కర్నూలు (లీగల్): డిసెంబర్ 14వ తేదీన ప్రిన్సిపల్ జిల్లా జడ్జి, చైర్మన్ జి.కబర్ది, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి అధ్యక్షతన లోక్ అదాలత్ జరగనుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం కర్నూలు, నంద్యాల జిల్లా కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లు, ఎక్సైజ్ అధికారులు, స్పెషల్ కలెక్టర్లు, కర్నూలు హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్–4లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి సంబంధించి సమన్వయ సమావేశం నిర్వహించారు.

కల్వర్టు ఏర్పాటుకు చర్యలు


కలవర్టు నిర్మాణ పనులు చేయిస్తున్న దృశ్యం


పాఠశాల ఆవరణలోని పాత కలవర్టును పరిశీలిస్తున్న కేసీ కెనాల్ ఏఈ మహేశ్వరరెడ్డి

సాక్షి ఎఫెక్ట్

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల పాఠశాలలోకి కేసీ నీరు రాకుండా ఉండేందుకు నూతనంగా కల్వర్టు ఏర్పాటుకు పనులు మొదలయ్యాయి. శుక్రవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ‘ జెడ్పీ పాఠశాలలోకి కేసీ నీరు!’ శీర్షికపై డీఈఓ జనార్దన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలను ఆవరణను పరిశీలించారు. కేసీ కెనాల్ నీరు ఏవిధంగా పాఠశాలలోకి వచ్చిందని సర్పంచ్ బీఎస్ రామ్మోహన్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. గతంలో కల్వవర్టు కింద ఉన్న పైపు మూసుకుపోయిందని, కేసీ కెనాల్‌కు అధికంగా నీరు రావడంతో నీరు వచ్చిందన్నారు. అదేవిధంగా పాఠశాల ఆవరణను కేసీ ఏఈ మహేశ్వరరెడ్డి, ఎంపీడీఓ వాసుదేవ గుప్తా, ఎంఈఓ విమలా వసుంధరదేవి పరిశీలించారు. నూతనం కల్వర్టు నిర్మాణానికి దాదాపు రూ.లక్ష దాకా ఖర్చువుతుందని అంచనా వేశారు. సర్పంచ్ కల్వర్టు నిర్మాణానికి పనులు మొదలు పెట్టారు. భవిష్యత్‌లో పాఠశాలలోకి కేసీ నీరు రాకుండా చూడాలని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సాక్షికి అభినందనలు తెలిపారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప

కోడుమూరు రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప పిలుపునిచ్చారు. కోడుమూరులోని ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం నాయకుతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ రంగ సంస్థలను కొరుచౌకగా ప్రైవేట్ పరం చేస్తోందని ఆరోపించారు. సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికుల హక్కులను కాలరాసేలా చట్టాలను చేస్తోందని విమర్శించారు. ఈ మేరకు ఈనెల 26న కర్నూలు, ఆదోని ప్రాంతాల్లో చేపట్టనున్న నిరసన కార్యక్రమాల్లో ప్రజలు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ, మండల కార్యదర్శి రాజు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి చిన్న రాముడు, కర్నూలు నగర కార్యదర్శి చంద్రశేఖర్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి శేషుకుమార్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పథకంతో ప్రయోజనాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఓర్వకల్లు: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంతో బహుళ ప్రయోజనాలు పొందవచ్చని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం ఓర్వకల్లు సచివాలయంలో ఉపాధి పనుల గుర్తింపు, ప్రణాళిక ప్రక్రియపై ఏపీఓ కుమార్‌సాయినాథ్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పథకం ద్వారా చేపట్టాల్సిన పనులకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని జెడ్పీటీసీ సభ్యులు రంగనాత్‌గౌడు కోరారు. ప్రభుత్వ పరమైన కార్యక్రమాలు, సమావేశాలకు తప్పనిసరిగా ఆయా గ్రామ ప్రజాప్రతినిధులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని విన్నవించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, స్థానిక నాయకులు లక్ష్మీకాంతారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, అబ్దుల్లా, శోభన్‌బాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మూడు సెంట్లు ఇవ్వాలి


పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

కల్లూరు: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మూడు సెంట్లు చొప్పున ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిధిలోని పెద్దటేకూరు గ్రామంలో సీపీఐ నాయకులు ర్యాలీ నిర్వహించి గ్రామ సచివాలయం దగ్గర ధర్నా చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి సంజీవరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు పుల్లన్న, శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదలకు స్థలం ఇవ్వాడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ. ఐదు లక్షలు మంజూరు చేయాలన్నారు. అదేవిధంగా పేదలు నివసిస్తున్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మనిషా, తులసి, శివ, సుమతి, రంగన్న, సుధాకర్, గిడ్డయ్య, సంజన్న, రామలక్ష్మి, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

పాణ్యం: మండలంలో ఎక్కడ డ్రాపౌట్స్ లేకుండా చూసుకోవాలని అలెస్కో కో–ఆర్డినేటర్ రఘురామిరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని పలు పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలన్నారు. పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు తప్పకుండా ఇంటర్ చదవాలని లేని పక్షంలో ఓపెన్ ద్వారా చదువుకోవాలన్నారు. అనంతరం పాఠశాలల వారిగా విద్యార్థుల సంఖ్య, హాజరు తదితర విషయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంఈఓ కోటయ్య, సీఆర్‌పీలు రాజశేఖర్ పాల్గొన్నారు.

విధులపట్ల అలసత్వం వహిస్తే చర్యలు

కోడుమూరు రూరల్ : అంగన్‌వాడీ సిబ్బంది తమకు కేటాయించిన విధులపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజమ్మ హెచ్చరించారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గూడూరు మండలం గుడిపాడు గ్రామంలో అంగన్‌వాడీ సిబ్బంది గొడవ పడి ప్రీస్కూల్ పిల్లలకు వంట చేయకపోవడంపై ఈనెల21న సెంటర్‌ను సందర్శించామన్నారు. వివరాలు సేకరించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందికి మెమోలు జారీ చేశామని చెప్పారు. అదేవిధంగా ఇద్దరికి గౌరవ వేతనాన్ని కూడా నిలుపుదల చేస్తున్నామన్నారు.

పీజీఆర్ఎస్ దరఖాస్తులపై తహసీల్దార్ ఆరా


తొగర్చేడులో పొలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

పాణ్యం: మండల పరిధిలోని తొగర్చేడు గ్రామంలో సుమారు పది మంది సాగు చేసుకుంటున్న సాగు భూమి గురించి వక్ఫ్‌బోర్డు ప్రతినిధులు పీజీఆర్ఎస్(ప్రజాపరిష్కారా వేదిక)లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది సాగుభూములను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సుమారు పది మంది రైతులకు చెందిన పొలాలు వక్ఫ్‌బోర్డుకు చెందినవని పీజీఆర్ఎస్‌లో లిఖిత పూర్వకంగా ఇచ్చారన్నారు. దీంతో పొలాలను, హద్దులు, రికార్డులు తదితర డాక్యుమెంట్లను పరిశీలించినట్లు చెప్పారు. పూర్తిస్థాయి నివేదికను పంపుతామన్నారు.

బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

కోడుమూరు రూరల్ : చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని మాజీ జెడ్పీటీసీ, నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎల్.వెంకటేశ్వర్లు డిమాండ్‌చేశారు. ఈనెల 23 శనివారం కర్నూలు ఆదర్శ కళాశాలలో జరిగే బీసీ సంక్షేమ సంఘం వనభోజన కరపత్రాలను శుక్రవారం గూడూరులో నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హక్కుల సాధనకు బీసీలు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కర్నూలులో జరిగే వనభోజన కార్యక్రమంలో బీసీ ప్రజా ప్రజాప్రతినిధులతో పాటు, ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ శ్రీనివాసులు, కౌన్సిలర్ విజయుడు, నాయకులు మద్దిలేటి, పెద్దయ్య, నాగరాజు, బుజ్జి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి


దుకాణాల నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

కోడుమూరు రూరల్ : దొంగతనాలను అరికట్టేందుకు పట్టణంలోని ప్రధాన షాపుల నిర్వాహకులు తమ తమ దుకాణాల ఎదుట సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం పట్టణంలోని వివిధ రకాల దుకాణదారులతో ఎస్ఐ సమావేశమయ్యారు. సీసీ కెమెరాల యొక్క ఆవశ్యకతను వివరించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ ప్రధాన దుకాణాల్లో దొంగతనాలు జరగకుండా ఉండేందుకు స్తోమత ఉన్న దుకాణదారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే అందరికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దొంగతనాలు, ఇతర సంఘనటలు చోటు చేసుకున్న సమయాల్లో నిందితులను గుర్తించేందుకు సులువుగా ఉంటుందని వివరించారు.

షెడ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి


భూమి పూజ చేస్తున్న ఎంపీడీఓ వాసుదేవ గుప్తా

గడివేముల: మండలంలో ఉపాధి పథకం కింద మంజూరైన గోకుల షెడ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ వాసుదేవ గుప్తా సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని గని గ్రామంలో గోకులం షెడ్ల నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 41 గోకులం షెడ్లు మంజూరయ్యాయన్నారు. ఇందులో ఇప్పటికే 20 దాకా నిర్మాణాలు జరుగుతున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయి సిబ్బంది వెంటనే రైతులను సంప్రదించి నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఎలాంటి అవకతవకలను పాల్పడకుండా ఉపాధిపనులు చేపట్టాలని, నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పనులు పూర్తి చేసేకునేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులు నివారించాలి


ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కర్నూలు (రూరల్): విచ్చలవిడిగా వెలసిన బెల్టు షాపులను నివారించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, జిల్లా నాయకుడు రంగప్ప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రహాస్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం డీవైఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ ఉల్చాల గ్రామంలో విచ్చలవిడిగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారన్నారు. రాజకీయ నాయకుల అండ చూసుకుని గుడులు, బడులు, ప్రధాన కూడళ్లలోని అక్రమంగా మద్యం అమ్మకాలు కొనసాగిస్తున్నారన్నారు. దీంతో శాంతిభద్రతలు కరువయ్యాయని, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి


రైతులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

పాణ్యం: రైతులు, ప్రజలకు ప్రధాని మోడీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీ రైతు సంఘం , సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 26 చేపట్టనున్న నిరసనలకు సంబంధించి కరపత్రాలను శుక్రవారం పాణ్యం, తమ్మరాజుపల్లెలో నాయకులు ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సోలార్ భూముల కల్పోయిన రైతులకు , వ్యవసాయ కూలీలకు 2013చట్టం ప్రకారం నష్టపరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, నాయకులు, సురేష్, ప్రసాద్, సీఐటీయూ ఎర్రమల, రైతులు, హమాలీ కార్మకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందించి మెమెంటో అందజేస్తున్న డిప్యూటీ డీఈఓ

కర్నూలు (రూరల్) : మండల పరిధిలోని ఇ.తాండ్రపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బీచ్ వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 26, 28 తేదీల్లో బాపట్ల సూర్యలంకలో జరిగే పోటీల్లో పాల్గొనున్న జగన్‌ను, శ్రీనివాసులును శుక్రవారం ఆ విద్యార్థులను డిప్యూటీ డీఈఓ హనుమంతరావు అభినందించి మొమెంటోను అందజేశారు. రాష్ట్రస్థాయి సైక్లింగ్‌లో 3వ స్థానం సాధించిన (అండర్–14) దేవి ప్రియ, పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులను వి.ఇందు, బ.గీతాంజలి, ఎం.హిమబిందును అభినందించి మొమెంటోలును అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు లక్ష్మీశైలజ, వ్యాయామ ఉపాధ్యాయుడు గణేష్, వైవి రాముడు, ఎ.సునిల్, ఎం.దేవిద్‌రాజశేఖర్, జి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.